



శిరివెళ్ల: పోలింగ్ వద్ద పరిస్థితిని తెలుసుకుంటున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి



భారీగా పోలింగ్



- జిల్లాలో ప్రశాంతంగా పోలింగ్
- క్యూలైన్లలో పోటెత్తిన ఓటర్లు
- ఉదయం నుంచే బారులు
- అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు
- జిల్లా వ్యాప్తంగా 80 శాతం పైగానే ఓటింగ్

నంద్యాల, మే 13 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు పోటెత్తారు. గతంలో లేనంతగా ఈసారి భారీగా పోలింగ్ నమోదైంది. సోమవారం జరిగిన ఎన్నికల్లో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ ఓటు వేసేందుకు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులుదీరారు. ఇక్కడ ఉన్న వారే కాకుండా, వేరే ప్రాంతాలకు ఉద్యోగ, ఉపాధి నిమిత్తం వెళ్లిన వారు సైతం తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు జిల్లాకు తరలిరావటం గమనార్హం. ఇక జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడ చెదురుమొదురు ఘటనలు తప్పించి ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకపోవడంతో జిల్లా ఎన్నికల యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. జిల్లా వ్యాప్తంగా ... శాతం పోలింగ్ నమోదైంది.

ఆలస్యంగా మొదలైన పోలింగ్..

జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల ఈవీఎంలు మొరాయించడం పోలింగ్ ఆలస్యంగా ఆరంభమైంది. ఎన్నికల అధికారులు ఈవీఎంలతో కుస్తీ పట్టాల్సి వచ్చింది. ఈవీఎంలపైన ఎన్నికల అధికారులు పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చినా, ఈవీఎంలు పని చేయకపోయే సరికి సిబ్బంది కాస్త గందరగోళానికి లోనయ్యారు. ఓ అరగంట అయ్యాక ఈవీఎంలు పనిచేయడం మొదలుపెట్టాయి. జిల్లాలోని పలు కేంద్రాల్లో దాదాపు 15 నిమిషాల నుంచి 30 నిమిషాలు ఆలస్యంగా పోలింగ్ మొదలైంది.

ఓటేసేందుకు ఉత్సాహంగా..

నంద్యాల జిల్లా వ్యాప్తంగా 13,89,307 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 6,80,402 మంది ఉండగా, మహిళా ఓటర్లు 7.08.647 మంది, ఇతరులు 258 మంది ఉన్నారు. వీరిలో చాలామంది ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు బయల్దేరారు. దీంతో జిల్లాలోని ఆయా పోలింగ్ సెంటర్ల వద్ద ఉదయం 7 గంటల నుంచే బారులు తీరి కనిపించారు. ఈవీఎంల మొరాయింపు వల్ల ఉదయం ఓటింగ్‌కు కాస్త మందకొడిగా సాగినట్లు కనిపించింది. ఉదయం 9 గంటలకు పోలింగ్ శాతం జిల్లా వ్యాప్తంగా 5.10 శాతం నమోదు అయింది. ఆ తర్వాత పోలింగ్ వేగంగా జరగడంతో 10 గంటలకు 11.22 శాతం, ఉదయం 11 గంటలకు 23.04 శాతం పూర్తయింది. ఉదయం అంతా వాతావరణం కాస్త చల్లగానే ఉన్నా, మధ్యాహ్ననికి ఎండ వేడిమి కాస్త ఎక్కువైంది. దీంతో మధ్యాహ్నం ఓటర్లు కాస్త పలుచబడ్డారు. దీంతో 11 గంటల నుంచి 12 గంటల మధ్య కేవలం 5.17 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. మొత్తానికి మధ్యాహ్నం 12 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 28.21 శాతం పోలింగ్ నమోదైంది. ఇక మధ్యాహ్నం తర్వాత ఆలస్యంగా వెళితే ఇబ్బంది అవుతుందన్న ఉద్దేశంతో చాలామంది ఓటర్లు పోలింగ్ సెంటర్‌కు పోటెత్తారు. సమయం ఉండదేమోనన్న ఉద్దేశంతో చాలామంది ఓటర్లు పోటెత్తారు. మధ్యాహ్నం 3 గంటల వరకు 59.37 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 7 నుంచి 12 గంటల వరకు 5 గంటల్లో 28.21 శాతం పోలింగ్ నమోదైతే, మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు కేవలం 3 గంటల్లో 31.16 శాతం పోలింగ్ నమోదైంది. ఇక సాయంత్రం 5 గంటలకు 71.54 శాతం నమోదు కాగా, రాత్రి 9 గంటలకు 77 శాతం నమోదైంది. పది గంటలపైన 80 శాతానికి పైగా పోలింగ్ నమోదైనట్లు సమాచారం. ఇక చాలామంది ఓటర్లు సాయంత్రం గంటల వరకు పోలింగ్ కేంద్రానికి వచ్చిన వారికి ఓటు వేసే అవకాశం కల్పించడంతో జిల్లాలో పలు చోట్ల పొద్దు పోయే వరకు పోలింగ్ జరిగింది.

వాతావరణం కాస్త అనుకూలించడంతో..

అధికార యంత్రాంగం ఓటర్లకు సరైన సదుపాయాలు కల్పించడంలో విఫలమైందనే విమర్శలు వచ్చాయి. కాకపోతే వర్షం కారణంగా ఆదివారం నుంచి జిల్లాలో వాతావరణం కాస్త చల్లబడింది. దీంతో ఓటర్లకు పెద్ద ఇబ్బందులు ఎదురవలేదు. డోన్ మండలంలో కాస్త ఎండ ఎక్కువగా ఉండటంతో పలు కేంద్రాల్లోని ఓటర్లు ఉక్కపోత, ఎండ వల్ల ఇబ్బందులు పడ్డారు. ఒక కొన్ని చోట్ల ఆకాశం మేఘావృతమై ఉండటంతో పోలింగ్ కేంద్రాల్లో సరైన వెలుతురు లేకపోవడంతో వీవీ ప్యాట్‌లు సరిగా కనిపించలేదన్న ఫిర్యాదులు వచ్చాయి.

చూపించిన పోలీసులు..

పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు కాస్త అత్యుత్సాహం చూపించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల అధికారులు నిర్ణయించిన పరిధిలోనికి ఓటర్లు తప్ప మిగిలిని వారు ఎవరూ రాకూడదు. అయితే జిల్లాలోని ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద జనం గుంపులు గుంపులుగా ఉన్నా పోలీసులు పట్టించుకున్న దాఖలాలు లేవు. పోలింగ్ కేంద్రాల్లోకి ఇతరులు వస్తున్నా పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. ఇక కొన్ని చోట్ల వైసీపీ నాయకులను అడ్డుకోకుండా యథేచ్ఛగా వదిలేశారు. ఇక కొన్ని చోట్ల టీడీపీ నాయకులపైన జులుం ప్రదర్శించారు. ప్యాపిలి మండలంలో టీడీపీ నాయకుడు, మార్కెట్ యార్డు చైర్మన్ రాజనారాయణమూర్తిపై ఎస్ఐ చేయి చేసుకోవడంతో కొంచెం ఉద్రిక్తత ఏర్పడింది. అక్కడికి మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ జోక్యం చేసుకోవడంతో వివాదం సద్దు మణిగింది. బనగానపల్లె మండలం ఎర్రగుడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ, వైసీపీ వర్గీయులు ఉన్నారు. అయితే అక్కడ విధులు నిర్వహిస్తున్న ఓ ఎస్ఐ కేవలం టీడీపీ వారిని మాత్రమే అక్కడి నుంచి తరిమే ప్రయత్నం చేశారు. ఆ గ్రామ మహిళా సర్పంచ్ ఎస్ఐ జులుంను ఎదుర్కోవడంతో కాస్త ఉద్విగ్న పరిస్థితి ఏర్పడింది. దీంతో ఎస్ఐ రెచ్చిపోయి టీడీపీ వర్గీయులపై లాఠీ ఝులిపించడంతో పాటు మహిళా సర్పంచ్‌తో దురుసుగా ప్రవర్తించాడు.



అత్యుత్సాహం

అక్కడక్కడ ఘర్షణలు..

జిల్లా వ్యాప్తంగా ఎన్నికల సందర్భంగా అక్కడక్కడ చెదురుమొదురు ఘటనలు తప్పించి పెద్ద ఘర్షణలు ఏమీ జరగలేదు. ఆళ్లగడ్డలో జంబులదిన్నె పోలింగ్ కేంద్రం వద్ద ఆయా పార్టీలకు చెందిన నాయకులు ఉండవద్దని పోలీసులు చెప్పారు. అయితే వైసీపీ వర్గీయులు అక్కడ నుంచి వెళ్లకుండా ఉండటంతో టీడీపీ వర్గీయులు అభ్యంతరం తెలిపారు. దీనిపై వైసీపీ, టీడీపీ వర్గీయుల మాటలు ముదిరి స్వల్ప ఘర్షణ రేగింది. ఇక ఇదే మండలంలో ఓలంపల్లెకు చెందిన వైసీపీ ఎన్నికల ఏజెంటు అన్ని పోలింగు బూత్‌లకు తిరుగుతుండటంతో టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు కలుగ జేసుకుని వివాదాన్ని సద్దుమణిచారు.

నంద్యాల (కల్చరల్): నంద్యాల పట్టణంలో సోమవారం క్రాంతినగర్‌లోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.



ఓటు వేసిన కలెక్టర్ కె. శ్రీనివాసులు



ఓటు వేసిన దివ్యాంగుడు



నంద్యాలలో వృద్ధుడిని పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్తున్న దృశ్యం



ఓటు వేసిన ఎస్పీ రఘువీర్‌రెడ్డి



ఓటు వేస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి



ఓటు వేసిన మాండ్ర శివానందరెడ్డి



ఓటు వేసిన గిత్తా జయసూర్య



కల్లూరులో ఓటు వేసిన కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి లక్ష్మీ నరసింహ యాదవ్



నందికొట్కూరు: పోలింగ్ సరళిని తెలుసుకుంటున్న మాండ్ర శివానందరెడ్డి



మిడ్తూరు: పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న బైరెడ్డి శబరి



చాగలమర్రి: క్యూలైన్‌లో ఓటర్లు



రుద్రవరంలో..



బేతంచెర్ల: పోలింగ్ కేంద్రానికి వృద్ధురాలిని వీల్‌చైర్‌లో తీసుకెళ్తున్న దృశ్యం



బనగానపల్లెలో ఓటర్ల క్యూ

సహనం కోల్పోయిన వైసీపీ

జిల్లా వ్యాప్తంగా భారీగా నమోదైన పోలింగ్‌తో వైసీపీ శ్రేణుల్లో అలజడి చెలరేగింది. దీంతో సహనం కోల్పోయిన ఆ పార్టీ నాయకులు, ఏజెంట్లు ప్రశాంతంగా జరుగుతున్న ఎన్నికల్లో గొడవలు సృష్టించేందుకు యత్నించారు. జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల టీడీపీ నాయకులు, ఆ పార్టీకి చెందిన ఏజెంట్లపై దాడులకు పాల్పడ్డారు. అయినప్పటికీ టీడీపీ శ్రేణులు సంయమనం కోల్పోకుండా సజావు ఎన్నికలకు సహకరించారు.

- శిరివెళ్ల టౌన్‌లో జడ్పీ పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ఓ వ్యక్తి మళ్లీ ఓటేసేందుకు వచ్చాడంటూ టీడీపీ ఏజెంట్లు అడ్డుకున్నారు. దీంతో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య చిన్న పాటి ఘర్షణ జరిగింది. పోలీసులు అడ్డుకుని వివాదం ముదరకుండా చేశారు.
- రుద్రవరం మండలం ఎంపీయూపీ పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో వైసీపీ, టీడీపీ ఎన్నికల ఏజెంట్లు చిన్నపాటి విషయంపై గొడవ పడ్డారు. దీంతో విషయం చిలికి చిలికి గాలివానగా మారి ఘర్షణ పెద్దగా మారింది. వెంటనే అప్రమత్తమైన ఎస్పీ రఘువీర్‌రెడ్డి రంగప్రవేశం చేసి ఇరు వర్గాల వారిని చెదరగొట్టారు.
- రుద్రవరం మండలం చిన్న కంబలూరులోని ప్రాథమికోన్నత పాఠశాల వద్ద ఓటింగ్ విషయంపై ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది.
- కొలిమిగుండ్ల మండలం నాగినిపల్లె గ్రామంలోని ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రంలో టీడీపీ మహిళా ఏజెంటును వైసీపీ వర్గీయులు బయటకు గెంటేశారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ వర్గీయులు పెట్నికోట నుంచి నాగినిపల్లెకు తరలివచ్చి, ఏజెంటును ఎందుకు బయటకు పంపారంటూ వాగ్వావాదానికి దిగారు. అక్కడి నుంచి పోలీసులు ఇరు వర్గాల వారిని తరిమారు. అనంతరం జడ్పీ చైర్మన్ సోదరుడు ఉదయభాస్కర్‌రెడ్డి పెట్నికోట గ్రామానికి వెళ్లి అక్కడ ఓ పోలింగ్ బూత్‌కు వెళ్లడంతో టీడీపీ వర్గీయులు అడ్డు చెప్పారు. దీంతో వైసీపీ వర్గీయులు దాడికి దిగారు. ఈ ఘటనలో ముగ్గురు టీడీపీ కార్యకర్తలకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం ముదరకుండా పోలీసులు జాగ్రత్తపడి ఇరు వర్గాలను చెదరగొట్టారు.
- బేతంచర్లలో స్వతంత్ర అభ్యర్థి పీఎస్ బాబుపై మంత్రి అనుచరులు దాడికి దిగారు. బేతంచర్లలోని మంత్రి బుగ్గన నివాసం ఉండే రహదారి గుండా ప్రయాణించడంతో ఆగ్రహించిన బుగ్గన అనుచరులు ఆయన వాహనాన్ని ధ్వంసం చేసి అద్దాలు పగులకొట్టారు. దీంతో ఇక్కడ కాస్త హైటెన్షన్ నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు మంత్రి అనుచరులను చెదరగొట్టారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎస్పీ



పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ

నంద్యాల క్రైం, మే 13 : సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో భాగంగా పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి సందర్శించారు. సోమవారం ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని గోవిందపల్లె, శిరివెళ్ల, ఆళ్లగడ్డ పట్టణంలోని ఎద్దుల పాపమ్మ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల తదితర సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను నంద్యాల ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన బందోబస్తు, క్యూ లైన్లను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో అల్లర్లు జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ రవీంద్ర, ఆర్మ్‌డు రిజర్వు సబ్ ఇన్‌స్పెక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, స్పెషల్‌పార్టీ సిబ్బం ది పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ఎస్పీ

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో భాగంగా సోమవారం నంద్యాల ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి ఓటుహక్కు వినియోగించుకున్నారు. నంద్యాల జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లోని హిందూ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు.



పోలింగ్ సరళి..!

నంద్యాల, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ సోమవారం ఆయా నియోజవర్గాల్లో ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్ రాత్రి పొద్దు పోయే వరకు జరిగింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 13,89,396 మంది ఓటర్లు ఉండగా, రాత్రి 9 గంటలకు 10,80,277 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా, దీంతో 77 శాతం పోలింగ్ నమోదైంది. వీరిలో 5,26,396 మంది పురుషులు, 5,53,746 మంది మహిళలు, 135 మంది ఇతరులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రాత్రి పది గంటలు తర్వాత 80 శాతానికి పైగానే పోలింగ్ నమోదైనట్లు సమాచారం.

నియోజకవర్గం	ఉ - 9కి	ఉ - 10కి	ఉ - 11కి	మ - 12కి	మ - 3కి	సా - 5కి
ఆళ్లగడ్డ	4.90	10.68	23.47	28.58	65.17	71.13
బనగానపల్లె	5.32	11.94	21.79	26.88	57.54	70.83
డోన్	4.75	10.44	23.30	28.21	60.98	78.84
నందికొట్కూరు	4.29	10.06	20.36	28.69	56.75	67.24
నంద్యాల	5.22	12.42	25.85	28.66	56.62	68.41
శ్రీశైలం	6.21	11.50	22.80	28.22	59.15	72.80
మొత్తం	**5.10**	**11.22**	**23.04**	**28.21**	**59.37**	**71.54**

పలు పోలింగ్ కేంద్రాల్లో రాత్రి పది గంటల వరకూ పోలింగ్ కొనసాగింది. స్పష్టమైన పోలింగ్‌శాతాన్ని అధికారులు నేడు వెల్లడించనున్నారు.

ఘర్షణలు.. తోపులాటలు

- పలుచోట్ల స్వల్ప ఉద్రిక్తత
- కర్నూలు ఉస్మానియా కాలేజీలో దొంగ ఓట్లు వేసే ప్రయత్నం
- అడ్డుకున్న టీడీపీ శ్రేణులు
- మల్లెపల్లిలో ఓటు వేసి వచ్చేందుకు వ్యక్తిపై దాడి
- కల్లూరు అర్బన్ వార్డుల్లో వైసీపీ యువ నాయకుడు హల్‌చల్


కర్నూలు ఉస్మానియా కాలేజీలో టీడీపీ వైసీపీ నాయకుల మధ్య వాగ్వాదం

కర్నూలు, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్వల్ప ఘర్షణలు.. వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. సోమవారం కర్నూలు లోక్‌సభ స్థానంతో పాటుగా ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికలు జరిగాయి. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. మధ్యాహ్నం తరువాత పలు చోట్ల వైసీపీ నాయకులు, కార్యకర్తలు గొడవలకు దిగారు. కర్నూలు అర్బన్‌లో ఉస్మానియా కాలేజీలో వైసీపీ శ్రేణులు దొంగ ఓట్లు వేస్తుండడంతో టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట, వాగ్వాదం జరిగింది. చివరకు పోలీసులు లాఠీలకు పని చెప్పాల్సి వచ్చింది. పాణ్యం నియోజకవర్గం కల్లూరు అర్బన్ వార్డుల్లో వైసీపీ యువ నాయకుడు కాటసాని శివనరసింహారెడ్డి పలు చోట్ల హల్‌చల్ చేశారు. ముజఫర్ నగర్‌లో ఓ పోలింగ్ కేంద్రంలో టీడీపీ, వైసీపీ అభ్యర్థులు గౌరు చరిత, కాటసాని రాంభూపాల్‌రెడ్డి బైఠాయించడంతో ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. పోలీసులు జోక్యం చేసుకొని వారిద్దరిని అక్కడి నుంచి పంపించేశారు.

● జిల్లాలో చోటు చేసుకున్న సంఘటనలు:

● ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఎమ్మిగనూరు పట్టణం శ్రీనీలకంఠేశ్వరస్వామి జడ్పీ హైస్కూల్‌లో ఏడు పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వైసీపీ కౌన్సిల్ ఇషాక్, టీడీపీ మాజీ కౌన్సిలర్ ఖలీముల్లా మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసుల జోక్యంతో సద్దుమణిగింది. నాగులదిన్నె గ్రామంలో టీడీపీ నాయకుడిపై వైసీపీ నాయకులు చెప్పుతో దాడికి దిగారు. ఎమ్మిగనూరు మండలం దేవిబెట్ట గ్రామంలో ఓ ప్రభుత్వ ఉద్యోగి (వైసీపీ సర్పంచి వెంకట్రామిరెడ్డి కుమారుడు) పోలింగ్ కేంద్రం వద్ద పలు మార్లు లోపలికి బయటికి తిరగడంతో టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో వాగ్వాదం జరిగింది.

● ఆలూరు నియోజకవర్గంలో ఆలూరు పట్టణం మండల పరిషత్ మెయిన్ స్కూల్‌లో ఐదు పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వైసీపీ కార్యకర్తలు టీడీపీ కార్యకర్తలపై దౌర్జన్యానికి దిగారు. టీడీపీ కార్యకర్తలు కూడా తిరగబడడంతో తోపులాట జరిగింది. పోలీసులు లాఠీచార్జి చేశారు. ఆస్పరి మండలం కారుమంచి గ్రామంలో ఓ మహిళ ఓటు విషయంలో వైసీపీ కార్యకర్తలు పోలింగ్ అధికారితో వాగ్వాదానికి దిగి పోలింగ్ కేంద్రం ముందు బైఠాయించారు.

● ఆదోని పట్టణం టీజీఎల్ కాలనీలో వైసీపీ నాయకులు ఫ్యాన్‌కు ఓటు వేయమని చెబుతుండడంతో టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఓటరు స్లిప్పులపై ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి ముద్రించడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని మున్సిపల్ కమిషనర్ రాంమోహన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

● కర్నూలు అర్బన్ ఉస్మానియా కళాశాల ఆవరణలో 9 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పోలింగ్ కేంద్రం 140, 141లో వైసీపీ కార్యకర్తలు సైక్లింగ్ ద్వారా దొంగ ఓట్లు వేస్తుండడంతో.. టీడీపీ ఏజెంట్లు అడ్డుకున్నారు. వాగ్వాదం జరిగింది. టీడీపీ ఏజెంట్లపై దాడికి ప్రయత్నిస్తూ వైసీపీ కార్యకర్తలు చుట్టుముట్టడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. గొడవకు కారణమైన ఓ వైసీపీ కార్యకర్తను పోలీసులు జీపులో ఎక్కించి స్టేషన్‌కు తీసుకెళ్తుండగా ఆ జీపును ముట్టడించి జీపుపై దాడికి దిగారు. దీంతో పోలీసులు లాఠీలకు పని చెప్పాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అక్కడికి చేరుకొని దొంగ ఓట్లను ఎలా ప్రోత్సహిస్తారని, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానని ఆగ్రహం వ్యక్తం చేశారు.

● పాణ్యం నియోజకవర్గం కల్లూరు అర్బన్‌లోని పలు వార్డుల్లో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తనయుడు కాటసాని శివనరసింహారెడ్డి హల్‌చల్ చేశారు. వీకర్ సెక్షన్ కాలనీలోని 41వ వార్డులో తెలుగు మహిళా నంద్యాల జిల్లా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, ఆమె తనయుడు శివ పోలింగ్ కేంద్రం సమీపంలో ఉన్నారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన కాటసాని శివ నరసింహారెడ్డి మీరు ఇక్కడేం చేస్తున్నారని ప్రశ్నించడంతో వాగ్వాదం జరిగింది. పోలీసులు వచ్చి సర్దిచెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. గణేష్ నగర్‌లోని 180 పోలింగ్ కేంద్రం వద్ద కూడా కాటసాని శివనరసింహారెడ్డి ఆధ్వర్యంలో దొంగ ఓట్లు వేస్తున్నారని టీడీపీ శ్రేణులు ఎదురు తిరగడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణ ఏర్పడింది. రాళ్లు వేసుకునే పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటనను ఓ వ్యక్తి సెల్ ఫోన్లో చిత్రీకరిస్తుంటే.. వైసీపీ నాయకుడు ఆ సెల్ లాక్కొని డిలీట్ చేశారని టీడీపీ నాయకులు ఆరోపించారు. ముజఫర్ నగర్ జడ్పీ హైస్కూల్‌లో ఓ పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే కాటసాని భార్య ఉమామహేశ్వరమ్మ ఉందని తెలిసి టీడీపీ అభ్యర్థి గౌరు చరిత, ఆమె కుమారుడు గౌరు జనార్దన్‌రెడ్డి అక్కడి చేరుకున్నారు. వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్యే కాటసాని కూడా వచ్చారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు ఇద్దరిని అక్కడి నుంచి పంపించేశారు.

● పత్తికొండ నియోజకవర్గం వెల్దుర్తి మండలం మల్లెపల్లి గ్రామంలో హైదరాబాదులో ఉంటున్న టీడీపీ మద్దతుదారుడు భాష్యంరాజు ఓటు వేసేందుకు స్వగ్రామానికి వచ్చాడు. ఓటు వేసి సమీపంలోని చిన్నాన్న ఇంటికి వెళ్లగా.. వైసీపీ కార్యకర్తలు దాడి చేయడంతో భాష్యంరాజు తలకు బలమైన గాయాలయ్యాయి. ఐదుగురు వైసీపీ కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేశారు. పత్తికొండ పట్టణం పోలింగ్ కేంద్రం 55 వద్ద టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది.

ముజఫర్ నగర్‌లో ఉద్రిక్తత

కర్నూలు/కల్లూరు, మే 13: కల్లూరు అర్బన్ 32వ వార్డు ముజఫర్ నగర్‌లో సోమవారం సాయంత్రం నుంచి రాత్రి దాకా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇక్కడ పోలింగ్ ప్రక్రియ ఆలస్యం కావడంతో ఓటర్లు భారీ ఎత్తున క్యూలైన్‌లో ఉన్నారు. అయితే బైరెడ్డి శబరి కాటసాని శివనరసింహారెడ్డి, కాటసాని ఉమామహేశ్వరమ్మ, కాటసాని రాంభూపాల్ రెడ్డి, గౌరు జనార్దన్ రెడ్డి, గౌరు చరితమ్మ అక్కడకు చేరుకోవడంతో అసలు ఏం జరుగుతుందోనన్న ఆందోళనకరమైన వాతావరణం నెలకొంది. పోలీసులు వీరిని ఎవరిని బయటకు పంపాలో అర్థంగాక అయోమయంలో ఉండిపోయారు. నాలుగో పట్టణ సీఐ శంకరయ్య, ఎస్ఐలు సునీల్, మోహన్ కిషోర్ రెడ్డిలు ప్రత్యేక దళాలతో అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. కాటసాని రాంభూపాల్‌రెడ్డికి, గౌరు చరితలకు సర్ది చెప్పడంతో వారి ఇద్దరు వెళ్లిపోయారు. రాత్రి 8 గంటల వరకు ఈ బూత్‌లో పోలింగ్ ప్రక్రియ సాగింది.


తోపులాడుకుంటున్న వైసీపీ, టీడీపీ కార్యకర్తలు

ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం

● కేకలు, ఈలలతో దద్దరిల్లిన రుద్రవరం ● రంగంలోకి దిగిన పోలీసులు


రుద్రవరంలో గుమిగూడిన వైసీపీ కార్యకర్తలు

రుద్రవరం, మే 13: రుద్రవరంలోని 263, 265 పోలింగ్ కేంద్రాలు ఎంపీయూపీ మెయిన్ పాఠశాలలో నిర్వహించారు. ఓ ఏజంటుకు, ఒక వ్యక్తికి మధ్య మాటా మాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఇరువర్గాల కార్యకర్తలు, నాయకులకు సమాచారం అందించారు. ఒక వైపు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి, గంగుల విజయసింహారెడ్డి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి అలా దాడి చేస్తే ఎలా అని ప్రశ్నించారు. మరో వైపు ఆళ్లగడ్డ టీడీపీ యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి ఇరిగెల బ్రదర్స్ రాంపుల్లారెడ్డి, సూర్యనారాయణరెడ్డి రుద్రవరం చేరుకున్నారు. ఇరిగెల రాంపుల్లారెడ్డి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి జరిగిన సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇరువర్గీయులు గుమికూడడంతో కేకలు ఈలలు మాటల యుద్ధం కొనసాగింది. పోలీసులు రంగంలోకి దిగి ఇరువర్గాలను 50 మీటర్ల దూరంలో అడ్డుకున్నారు. ఏం జరుగుతుందోనని రుద్రవరం ప్రజలు భయాందోళన చెందారు. పోలీసులు ఇరువర్గాలకు నచ్చజెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

ఎస్పీ పోలీసు సిబ్బందిపై ఎస్పీ సీరియస్

రుద్రవరంలో ఇంత జరుగుతున్నా తనకెందుకు సమాచారం ఇవ్వలేదని ఎస్పీ రఘువీర్ రెడ్డి పోలీసు సిబ్బంది, ఎస్బీ సిబ్బందిపై సీరియస్ అయ్యారు. సోమవారం సాయంత్రం రుద్రవరం గ్రామాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్, సిబ్బంది ఉన్నారు.


రుద్రవరం: పోలింగ్ కేంద్రం ఆవరణలో ఎమ్మెల్యే బిజేంద్రరెడ్డి ఇలా..

ఓటు వేసేందుకు వచ్చి.. మృత్యువాత

● పోలింగ్ బూత్‌లోనే.. ● మాధవరంలో విషాదఛాయలు


ఈరన్న (ఫైల్)

మంత్రాలయం, మే 13: మంత్రాలయం మండలం మాధవరం గ్రామానికి చెందిన తెలుగు పంది ఈరన్న (62) అనే వ్యక్తి ఓటేసేందుకు వచ్చి పోలింగ్ బూత్‌లోనే మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం మధ్యాహ్నం జరిగింది. ఈరన్న మాధవరంలో ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ బూత్ నెం.53లో ఓటేసేందుకు గంటల తరబడి క్యూలో నిల్చున్నాడు. అప్పటికే తోటి ఓటర్లతో కళ్లు తిరుగుతున్నాయని చెప్పాడు. ఓటు వేసి బయటకు వస్తుండగా స్పృహ తప్పి పడిపోయాడు. అక్కడే ఉన్న ఎన్నికల సిబ్బంది, గ్రామ ప్రజలు ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేస్తుండగా పోలింగ్ బూత్‌లోనే మృతి చెందాడు. గంటల తరబడి క్యూలో నిల్చుండడం, ఉదయం అల్పాహారం సైతం తినకుండా క్యూలో నిల్చుండటంతో అస్వస్థతకు గురై మృతి చెంది ఉంటాడని బంధువులు ఆరోపిస్తున్నారు. మృతునికి ఒక కొడుకు, కూతురు ఉన్నారు. బంధువులు రోదిస్తున్న దృశ్యం పలువురిని కంటతడి పెట్టించింది.

ఆదోని ఎమ్మెల్యేపై కేసు నమోదు

● ఎమ్మెల్యే ఫొటో ఉన్న ఓటర్ స్లిప్పుల పంపిణీ
● ఎన్నికల అధికారులు సీరియస్



ఆదోని, మే 13: ఆదోని వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డిపై రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఓటర్లకు ప్రలోభాలు గురి చేసేలా ఓటర్ స్లిప్పులపై ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ఫొటో ముద్రించి ఓటర్ స్లిప్పులను ఓటర్లకు పంపిణీ చేశారు. దీనిపై ఎన్నికల సంఘం సీరియస్ అయింది. దీంతో ఎన్నికల నియమావళి ఉల్లంఘన కింద ఆయనపై కేసు నమోదు చేసినట్లు సీఐ గోపినాథ్ తెలిపారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించిన డీఐజీ



ఆళ్లగడ్డ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు

నంద్యాల క్రైం, మే 13 : సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో భాగంగా పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు సందర్శించారు. సోమవారం ఆళ్లగడ్డ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, వైపీపీఎం ఉన్నత పాఠశాల తదితర సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎన్నికల ప్రత్యేక పోలీసు పరిశీలన అధికారి హిమాన్షు శంకర్ త్రివేది, నంద్యాల ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డిలతో కలిసి డీఐజీ సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చే సిన బందోబస్తు, క్యూలైన్లను పరిశీలించారు. అనంతరం డీఐజీ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అల్లర్లు జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఓటర్లను క్యూలైన్లలో పంపించాలని, వంద మీటర్ల పరిధిలో ఎవరూ గుంపులుగా ఉండకుండా చూసుకోవాలని, సెల్ ఫోన్లతో ఓటర్లను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించరాదని అన్నారు. పోలింగ్ తర్వాత ఈవీఎం బాక్స్‌లను స్ట్రాంగ్‌రూముల్లోకి చేర్చే వరకు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని డీఐజీ విజయరావు ఆదేశించారు.


పోలీసులతో మాట్లాడుతున్న నంద్యాల ఎస్పీ రఘువీర్‌రెడ్డి

విద్యుదాఘాతంతో రైతు మృతి

చిప్పగిరి, మే 13: చిప్పగిరి గ్రామానికి చెందిన రైతు కొండా వెంకటేష్ (45) విద్యుదాఘాతంతో సోమవారం మృతి చెందాడు. ఉదయం వర్షం కురుస్తుండడంతో ఇంటి పైకప్పు పై నిలిచిన నీటిని తొలగించడానికి వెళ్లి కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాడు. మృతునికి భార్య, వికలాంగుడైన ఒక కుమారుడు, నలుగురు ఆడపిల్లలు ఉన్నారు.

పిడుగుపాటుతో యువకుడి మృతి

చిప్పగిరి, మే 13: చిప్పగిరిలో పిడుగుపాటుకు గురై సురేష్ (26) అనే యువకుడు సోమవారం మృతి చెందాడు. ఎద్దులపాకలో నిద్రిస్తున్న కొనకొండ్ల సురేష్‌పై రాత్రి పిడుగు పడటంతో మృతి చెందినట్లు తండ్రి సుంకన్న తెలిపారు.

పెట్నికోటలో ఉద్రిక్తత

వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య ఘర్షణ
ఇరువర్గాలకు చెందిన పలువురికి గాయాలు

కొలిమిగుండ్ల రూరల్, మే 13: మండలంలోని పెట్నికోట గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామ పంచాయతీలోని నాయినిపల్లె పోలింగ్ బూత్-16 నుంచి టీడీపీకి చెందిన మహిళా ఏజెంట్‌ను వైసీపీ వారు బయటికి పంపారని టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని వాగ్వాదానికి దిగాయి. దీంతో సీఐ గోపినాథ్‌రెడ్డి అక్కడికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. అనంతరం పెట్నికోట గ్రామంలో వివాదం నెలకొంది. జడ్పీ చైర్మన్ సోదరుడు ఎర్రబోతుల ఉదయ్‌భాస్కరరెడ్డి 13-పోలింగ్ బూత్‌లోకి వెళ్లాడని టీడీపీ శ్రేణులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా పోలీసులు టీడీపీ శ్రేణులపై చేయి చేసుకోవడం మరింత ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు వైసీపీ అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ టీడీపీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఎర్రబోతుల ఉదయ్‌భాస్కరరెడ్డిని బూత్ నుంచి పంపించాలంటూ నిరసన చేపట్టారు ఈ సందర్భంగా ఇరు వర్గాలు బాహాబాహీకి దిగి ఒకరిపై మరొకరు రాళ్లు రువ్వుకున్నారు. ఈ దాడుల్లో టీడీపీకి చెందిన ఆరుగురు గాయాలు కాగా వైసీపీకి చెందిన వారికి గాయాలయ్యాయి. దీంతో పోలింగ్ నిలిచి పోవడంతో ప్రత్యేక పోలీసు బలగాలు అక్కడికి చేరుకొని, ఎర్రబోతుల ఉదయ్‌భాస్కరరెడ్డిని అక్కడి నుంచి పంపించివేశారు. తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులతో సుమారు గంట పాటు పోలింగ్ నిలిచిపోయింది. తిరిగి పోలింగ్ ఆలస్యంగా ప్రారంభం కావడంతో రాత్రి 9గంటల వరకు అధికారులు పోలింగ్ కొనసాగించారు.


పోలింగ్ బూత్ వద్ద మోహరించిన కార్యకర్తలు


పోలీసులతో వాగ్వాదానికి దిగిన టీడీపీ శ్రేణులు

ఎస్ఐ రామిరెడ్డి అత్యుత్సాహం

- పోలింగ్ స్టేషన్ వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలపై జులుం
- ఎర్రగుడి సర్పంచ్ లక్ష్మీదేవిపై దురుసు ప్రవర్తన
- ఎదురుతిరిగిన గ్రామస్థులు, టీడీపీ కార్యకర్తలు

బనగానపల్లె రూరల్, మే 13: బనగానపల్లె పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రామిరెడ్డి అత్యుత్సాహంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై జులం ప్రదర్శిస్తూ రెచ్చిపోయారు. మండల పరిధిలోని ఎర్రగుడి గ్రామంలో సోమవారం మధ్యాహ్నం సమయంలో పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చిన ఎస్ఐ రామిరెడ్డి ఒక్కసారిగా ఆవేశంతో రెచ్చిపోయి చుట్టూ పక్కల ఉన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలపై లాఠీ ఝులిపించారు. మహిళ అని కూడా చూడకుండా ఎర్రగుడి సర్పంచ్ లక్ష్మీదేవిని పోలింగ్ కేంద్రం వద్ద నుంచి వెళ్లిపోవాలని దురుసుగా మాట్లాడటంతో పక్కనే ఉన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎస్ఐకి ఎదురుతిరిగారు. మరోసారి ఎస్ఐ తనదైన శైలిలో రెచ్చిపోయి వారిని ఇష్టానుసారంగా తిడుతూ వైసీపీ పట్ల తన స్వామి భక్తిని చాటుకున్నారు. వైసీపీ నాయకుల మెప్పు పొందేందుకే తమ పట్ల ఎస్ఐ దురుసుగా ప్రవర్తిస్తూ టీడీపీ కార్యకర్తలపై ఎస్ఐ దాడి చేశాడని సర్పంచ్ లక్ష్మీదేవి ఆరోపించారు. పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ కార్యకర్తలతో పాటు వైసీపీ వారు కూడా ఉన్నారని, అయితే వైసీపీ కార్యకర్తలను ఏమీ అనకుండా టీడీపీ నాయకులు, కార్యకర్తలనే టార్గెట్ చేయడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు.

ఇండిపెండెంట్ అభ్యర్థి కారు అద్దాలు ధ్వంసం

బుగ్గన వర్గీయులపై కేసు నమోదు

బేతంచెర్ల, మే 13: డోన్ అసెంబ్లీ ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన రిటైర్డు డీఎస్పీ పీఎన్ బాబు కారు అద్దాలను మంత్రి బుగ్గన వైసీపీ వర్గీయులు ధ్వంసం చేశారు. పీఎన్ బాబు వివరాల మేరకు.. పీఎన్ బాబు బేతంచెర్ల మండలంలోని వివిధ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ క్రమంలోనే కొలుములపల్లె నుంచి బేతంచెర్లకు కారులో వెళ్లాడు. మంత్రి బుగ్గన పల్లెలకు వెళ్లి తిరిగి ఇంటికి బయలుదేరాడు. అయితే బుగ్గన కారును పీఎన్ బాబు కారు వెంబడించిందని పట్టణంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి స్వగృహం వద్ద అడ్డుకున్నారు. అనంతరం పీఎన్ బాబు కారు అద్దాలను ధ్వంసం చేశారు. ఈ విషయంపై మంత్రి బుగ్గన, చలం రెడ్డి, నాగురాజులతోపాటు మరో 30 మంది కార్యకర్తలపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పీఎన్ బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రియతమ్ రెడ్డి తెలిపారు.


వైసీపీ వర్గీయుల దాడిలో పగిలిన కారు అద్దం

టీడీపీ కార్యకర్తపై వైసీపీ దాడి

వెల్దుర్తి, మే, 13: మండలంలోని మల్లెపల్లె గ్రామంలో టీడీపీ కార్యకర్త భాష్యం రాజుపై వైసీపీ కార్యకర్తలు సోమవారం కర్రలతో దాడి చేశారు. భాష్యం రాజు ఉద్యోగరీత్యా హైదరాబాదులో ఉంటున్నాడు. సొంతూరు మల్లెపల్లెలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చాడు. ఓటు హక్కు వినియోగించుకొని తన చిన్నాన్న ఇంటికి వెళ్లాడు. వైసీపీ కార్యకర్తలు ప్రచారం చేస్తున్నాడనే నెపంతో కర్రలతో దాడి చేశారు. విషయం తెలుసుకున్న సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డిలు గ్రామానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. గాయపరిచిన వ్యక్తులపై కేసు నమోదు చేశారు.



ఏయ్.. ఏమనుకుంటున్నావ్..?

● ఎస్ఐకి ఎమ్మెల్యే శిల్పా వార్నింగ్
● దేవనగర్‌లో స్వల్ప ఉద్రిక్తత


నంద్యాలలో ఎస్ఐపై ఆగ్రహంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల (నూనెపల్లె), మే 13: నంద్యాలలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి ఎస్ఐపై రెచ్చిపోయాడు. పోలింగ్ కేంద్రంలోకి వెళ్లకుండా అడ్డుకోవడంతో దురుసుగా ప్రవర్తించాడు. నంద్యాలలోని దేవనగర్‌లో ఉన్న పురపాలక పాఠశాల కేంద్రానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఏవీఆర్ ప్రసాద్, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు డాక్టర్ రవికృష్ణ వచ్చారు. ఎన్నికల పాసులను చూపించడంతో వారిని లోపలికి అనుమతించారు. అదే సమయంలో పోలింగ్ సరళిని పరిశీలించేందుకు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి అతని అనుచరులతో వచ్చాడు. శిల్పా తన అనుచరులతో గుంపులుగా పోలింగ్ కేంద్రంలోకి రావడంతో ఎలా అనుమతిస్తారంటూ పోలీసులను టీడీపీ నేతలు ప్రశ్నించారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం జరిగింది. దీంతో ఇతర ప్రాంతం నుంచి ఎన్నికల విధులకు వచ్చిన ఓ ఎస్సై ఇరువర్గాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే శిల్పా రవి, ఎస్ఐకి వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో ఎమ్మెల్యే శిల్పా రవి 'ఏయ్ ఎవరనుకుంటున్నావ్... ఏమనుకుంటున్నావ్... గుర్తు పెంటుకుంటానని' ఆ ఎస్ఐకి వార్నింగ్ ఇచ్చాడు. ఆ తరువాత టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాతిరెడ్డి తులసిరెడ్డి అక్కడికి రావడంతో మాటామాటా పెరిగి స్వల్ప ఉద్రిక్తతకు దారి తీసింది. ఘటనా స్థలానికి త్రీటౌన్ సీఐ నరసింహులు, బీఎస్ఎఫ్ సిబ్బంది చేరుకుని చెదరగొట్టారు.


ఓటు వేసేందుకు క్యూలైన్‌లో ఉన్న ఓటర్లు

ప్రశాంతంగా పోలింగ్


శ్రీశైలం మండలంలో క్యూలో ఓటర్లు

నంద్యాల (నూనెపల్లె), మే 13: నంద్యాల పట్టణంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఎన్నికలు సజావుగా జరిగేందుకు, అధికార యంత్రాంగం, పోలీసు సిబ్బంది విధులు నిర్వర్తించారు. ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలలో కాసేపు ఈవీఎం మిషన్లు సాంకేతిక లోపంతో పనిచేయలేదు. సిబ్బంది మరమ్మతులు చేసి వెంటనే పోలింగ్ ప్రక్రియను ప్రారంభించారు. నంద్యాలలో ని దేవనగర్ లో వున్న మున్సిపల్ పాఠశాలలో పోలింగ్ కేంద్రం వద్ద జరిగిన స్వల్ప ఉద్రిక్తత ఘటన మినహాయించి పట్టణంలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు చేటుచేసుకోలేదు.

నంద్యాల టౌన్: నంద్యాల పట్టణంలోని టెక్కె మున్సిపల్ స్కూల్‌లోని పోలింగ్ బూతులు 147, 148, 149 బూత్‌లలో పోలింగ్ ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభమైంది. మాక్ పోలింగ్ సమయంలో ఈవీఎంలలో సాంకేతిక లోపం గుర్తించడంతో పోలింగ్ ఆలస్యమైంది. బెల్ ఇంజనీర్‌లకు సమాచారం అందించడంతో వారు వచ్చి సమస్యను పరిష్కరించారు. నంద్యాలలోని సెయింట్ జోసఫ్ పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన 105 పోలింగ్ బూత్‌లో కూడా ఈవీఎంలు మొరాయించడంతో ప్రక్రియ ఆలస్యమైంది.

- నంద్యాలలో ఓట్లు వేయడానికి వృద్ధులు, దివ్యాంగులు తరలి వచ్చారు. కొన్ని బూత్‌ల వద్ద ర్యాంపు లేకపోవడంతో వీల్ ఛైర్‌లలో వచ్చిన వారిని అలాగే వీల్ ఛైర్‌ను నలుగురు కలిసి పోలింగ్ కేంద్రాల్లోకి తీసుకెళ్లారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉంటుందని భావించిన ఓటర్లు పోలింగ్ రోజున ఉదయం 6.15 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. పురుషులు, మహిళలను ఒకే క్యూలైన్ ఏర్పాటు చేయడంతో మహిళలు ఇబ్బందులు పడ్డారు. కొన్ని పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రక్రియ ఈవీఎంల మొరాయింపుతో ఆలస్యమైన నేపథ్యంలో 8.30 - 9.00 గంటల సమయంలో కొందరు సిబ్బంది ఉదయం అల్పాహారం చేయడానికి బయటకు వెళ్ళిన కారణంగా ఇంకా కొద్ది సేపు పోలింగ్ ప్రక్రియకు అంతరాయం ఏర్పడింది. నంద్యాల వైసీపీ అభ్యర్థి శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి, మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులు రామకృష్ణ హైస్కూల్‌లోని పోలింగ్ బూత్ నంబరు 97లో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

నంద్యాల(కల్చరల్): నంద్యాల ముల్లాన్‌పేటలోని పురపాలక బాలికల ప్రాథమికోన్నత ఉర్దూ పాఠశాలలో పీఎస్ నెంబర్ 74లో నంద్యాల టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్, వీరి కుమారులు ఎన్ఎండీ పర్వీన్, ఎన్ఎండీ ఖలీల్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నంద్యాల పాలిటెక్నిక్ కాలేజీ 145 కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. నంద్యాలలోని నూనెపల్లెలో బీజేపీ పార్లమెంట్ కో ఆర్డినేటర్ అబిరుచి మధు ఓటుహక్కును వినియోగించుకున్నారు.

నంద్యాల రూరల్: నంద్యాల మండలంలోని అన్ని గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎక్కడ ఎలాంటి ఘటనలు జరగక పోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి భీమవరం, కానాల తదితర గ్రామాలలో పోలింగ్ సరళిని, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది తులసిరెడ్డి కొత్తపల్లి, పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలలోని పోలింగ్ సరళిని పరిశీలించారు.

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. నియోజకవర్గంలోని ఆత్మకూరు, వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది, శ్రీశైలం మండలాల్లోని 226 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 5.30గంటలకే పోలింగ్ సిబ్బంది ఆయా రాజకీయ పార్టీలకు చెందిన ఏజెంట్ల సమక్షంలో మాక్‌పోలింగ్ నిర్వహించి 7గంటల సమయానికి పోలింగ్ ప్రక్రియను సిద్ధం చేశారు. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులుతీరారు. అయితే పలు చోట్ల పోలింగ్ ప్రారంభమయ్యే సమయానికి ఈవీఎంలు మొరాయించగా, మరికొన్ని చోట్ల ఎన్నికల సిబ్బందే ప్రక్రియను ఆలస్యం చేశారు. పలు కేంద్రాల్లో రాత్రి వరకు కూడా పోలింగ్ కొనసాగింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి ఘర్షణలు, అపశృతులు, అల్లర్లు చోటు చేసుకోకుండా సీబీడీ డీఎస్పీ అబ్దుల్ కరీమ్ నేతృత్వంలో వివిధ బలగాలతో పోలీసులు బందోబస్తు చేపట్టారు. నియోజకవర్గంలో మొత్తం 33 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో నలుగురు ఆర్మ్‌డ్ ఫోర్స్‌ను అందుబాటులో ఉంచి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. అలాగే ఎప్పటికప్పుడు ఓటింగ్ సరళిని రిటర్నింగ్ ఆఫీసర్ సుధారాణి పర్యవేక్షించారు. మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ ప్రక్రియను పరిశీలించారు. మార్కెట్ యార్డు పోలింగ్ కేంద్రంలో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో చెదురు మొదురు సంఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఈవీఎంలు మొరాయించడం, మాక్ పోలింగ్ ఆలస్యం కావడంతో పలు కేంద్రాలలో పోలింగ్ ఆలస్యంగా మొదలైంది.కాగా మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను టీడీపీ అభ్యర్థి బుడ్డారాజశేఖరరెడ్డి పోలింగ్ సరళిని పరిశీలించారు. పెద్ద అనంతపురం గ్రామంలోని పోలింగ్ బూత్‌లో 50 ఓట్ల వరకు మాక్‌పోలింగ్ నిర్వహించారు.కాగా వాటిని తొలగించకుండానే తిరిగి పోలింగ్ నిర్వహించడంతో ఆ బూత్‌లో అప్పటికే 130 ఓట్లు పోలయ్యాయి. దీంతో ఈ విషయాన్ని అధికారులు ఉన్నతాధికారులకు తెలియజేశారు. దీంతో అక్కడ పోలింగ్‌ను దాదాపు మూడు గంటలపాటు నిలిపి వేశారు. అమలాపురం గ్రామంలో 1267 మంది ఓటర్ల కోసం ఒక్క పోలింగ్ కేంద్రం మాత్రమే అధికారులు కేటాయించడంతో అక్కడి పోలింగ్ సరళి సైతం ఉదయం నుంచి నెమ్మదిగా సాగింది. కొన్ని కేంద్రాలలో టీడీపీ వైసిపి వర్గీయులమధ్య వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి.

శ్రీశైలం: శ్రీశైలం మండలంలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద సరియైన బందోబస్తును ఏర్పాటు చేయకపోవడంతో ఓటర్లను నియంత్రించడం సాధ్యం కాకపోవడంతో తోపులాటలు చోటుచేసుకున్నాయి. అలాగే వృద్ధులు, వికలాంగులు, చంటి బిడ్డల తల్లులు తమ ఓటును వేయడానికి తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద సరైన సదుపాయాలు కల్పించలేదని ఓటర్లు తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఇదిలా ఉంటే రాజీనామా చేసిన వలంటీర్లు పోలింగ్ బూత్‌లలో ఏజెంట్లుగా కనిపించడంతో ప్రతిపక్ష పార్టీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఎమ్మార్వోకు ఫిర్యాదు చేశారు. గతంలో వలంటీర్లుగా విధులు నిర్వహించిన వారిని అధికార పార్టీ ఏజెంట్లుగా నియమించడంతో వారు ఓటర్లు ప్రభావితం చేస్తారని ప్రతిపక్ష నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. పలు కేంద్రాల్లో ఆలస్యంగా పోలింగ్ ప్రారంభం అయ్యింది. శ్రీశైలంలో నాలుగు, ఐదు కేంద్రాల్లో వైసీపీ అనుచరులు సరైన ధ్రువీకరణ పత్రాలు చూపకుండా ఓటు వేసేందుకు ప్రయత్నించగా టీడీపీ నాయకులు వారిని అడ్డుకున్నారు. అధికారపార్టీ నాయకులు ఎస్సి, ఎస్టీ, చెంచు గిరిజనుల కాలనీలలో సంచరించి ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని ప్రతిపక్ష నాయకులు ఆరోపించారు. మండలంలోని సుండిపెంట గ్రామంలో 19వ పోలింగ్ కేంద్రంలో దాదాపు గంటకుపైగా ఈవీఎంలు మొరాయించాయని ఓటింగ్ ప్రక్రియ ఆలస్యంగా కొనగిందని ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు.

నందికొట్కూరు: నందికొట్కూరు నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభం కావాల్సిన పోలింగ్ కొన్ని పోలింగ్ బూతుల్లో గంట ఆలస్యంగా ప్రారంభమైంది. నందికొట్కూరులోని వాల్మీకి నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ 75 పోలింగ్ కేంద్రంలో 8 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. నందికొట్కూరులోని 70, 71 పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ నాయకులు అధికంగా ఉండి ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని టీడీపీ ఎంపీ అభ్యర్థి డా.బైరెడ్డి శబరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ పోలింగ్ కేంద్రానికి సంబంధం లేని వారు కూడా ఎందుకు ఇక్కడ ఉన్నారంటూ ఆమె పోలీసులను ప్రశ్నించారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి వారిని అక్కడి నుంచి పంపించివేశారు. నందికొట్కూరు హాజీనగర్‌లోని ఉర్దూ పాఠశాలలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దార సుధీర్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ముచ్చుమర్రిలో వైసీపీ నాయకుడు శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ రబ్బాని, కౌన్సిలర్ జాకీర్‌లు పట్టణంలోని సుబ్బారావుపేటలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

నందికొట్కూరు రూరల్: నాగటూరు గ్రామంలో ఈవీఎం మొరాయించింది. మరొక ఈవీఎంను అధికారులు తీసుకుని వచ్చి ఏర్పాటు చేశారు. అల్లూరు గ్రామంలో టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్య ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మిడుతూరు: మిడుతూరులో టీడీపీ నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి జడ్పీహెచ్ఎస్‌లో పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పోలింగ్ శాతం పోలింగ్ విధానాల వివరాలు మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. చౌట్కూరు, చింతలపల్లి, గుడిపాడు గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో గంట ఆలస్యంగా పోలింగ్ జరిగింది. రాత్రి వరకు పోలింగ్ జరిగింది. మాసపేట, కలమందలపాడు గ్రామాల్లో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య తోపులాట జరిగింది. సాయంత్రం గాలి వాన కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయి అధికారులు పోలింగ్‌ను 2 గంటల పాటు నిలిపివేశారు.

పగిడ్యాల: మండలంలోని కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో అరగంటకు పైగా పోలింగ్ ఆలస్యం కావడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. ముచ్చుమర్రి గ్రామంలోని 91వ పోలింగ్ కేంద్రంలో టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి ఓటర్లతో కలిసి క్యూలైన్‌లో నిలబడి ఓటు వేశారు.

- నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ద్వారా ఓటింగ్ ప్రక్రియ నిర్వహించారు. మండల పరిధిలోని ఆయా గ్రామాలలోని పోలింగ్ కేంద్రాల వద్ద స్పెషల్ పార్టీ పోలీసులను మోహరించారు.
- ప్రాతకోట గ్రామంలోని 136, 137 పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ నాయకుడు రమేష్‌నాయుడు ఓటర్ల వద్దకు వచ్చి వైసీపీకి ఓటు వేయాలని ఓటర్లను కోరడంతో టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య స్వల్ప వాగ్వాదం చేసుకుంది. గ్రామానికి చెందిన గంగి హరి ప్రసాద్ ఓటు వేసేందుకు భార్యతో కలిసి కేంద్రానికి రాగా వైసీపీ నాయకులు ఈలలు కేకలు వేయడంతో విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు.
- ముచ్చుమర్రి, ప్రాతకోట గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి పరిశీలించారు. నెహ్రూనగర్, ముచ్చుమర్రి గ్రామాల్లో టీడీపీ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఎన్నికల సరళిని పరిశీలించారు.
- ప్రాతకోట గ్రామంలో వైసీపీ నాయకుల ఆగడాలు ఎక్కువవుతున్నాయని, గ్రామానికి చెందిన మహిళలు మాండ్ర శివానందరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. వారి ఆగడాలను అరికట్టకపోతే తామే తన్ని తరిమివేయాల్సి వస్తోందని మహిళలు తెలిపారు.

పాములపాడు: పాములపాడు, ఇస్కాల, వాణాల గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఎన్నికల పోలింగ్ గంట, ఇస్కాల గ్రామంలో రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో కావడంతో మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా మండలంలోని 12 గ్రామపంచాయతీ పరిధిలో 33 పోలింగ్ బూతులు ఏర్పాటు చేయగా అన్నిచోట్ల సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండ్లెం గ్రామంలో రెండు ఈవీఎంలు, తంగడంచలో ఒకటి, చాబోలు గ్రామంలో ఒక ఈవీఎం మొరాయించడంతో గంటపాటు ఆలస్యం కావడంతో ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాటిపాడు గ్రామంలో ఓటు వేయడానికి వెళ్తున్న వారికి వైసీపీ నాయకులు ఫ్యానుకు ఓటేయాలని చెబుతుండటంతో టీడీపీ నాయకులు అడ్డుచెప్పారు. దీంతో ఘర్షణ పడటంతో ఉద్రిక్తత నెలకొంది. ఇరువర్గాలను పోలీసులు చెదరగొట్టి జూపాడుబంగ్లా పోలీసుస్టేషనుకు తరలించారు.

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలో చెదురుమొదురు సంఘటనలు మినహాయిస్తే.. మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఈవీఎంల మొరాయింపుతో ఎదురుపాడులో ఉదయం 9 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. అలాగే సింగరాజుపల్లిలో, ఎర్రమటంలలో ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు ఈవీఎంలు మొరాయించాయి. అంతేగాకుండా ఈవీఎంల పని విధానాలు నత్త నడకన సాగుతుండటంతో రాత్రి 8.15 గంటల వరకు అధికారుల ఆదేశాల మేరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నందికొట్కూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య, కొత్తపల్లి, ఎర్రమఠం, శివపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. అలాగే రాష్ట్ర టీడీపీ నాయకులు కాకరవాడ చిన్న వెంకటస్వామి, గువ్వలకుంట్ల కొత్తపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

గోస్పాడు: జిల్లెల్ల, యాళ్ళూరు, దీబగుంట్ల, గోస్పాడు గ్రామాలతో పాటు పసురుపాడు, జూలేపల్లె, జిల్లెల్ల, తేళ్ళపూరి, తదితర గ్రామాల్లో ఓటు వేయడానికి ఓటర్లు ఎక్కువ సంఖ్యలో తరలి వచ్చారు. మండలంలో మోడల్ పోలింగ్ కేంద్రంగా పసురుపాడు పోలింగ్ కేంద్రాన్ని ఎంపిక చేసి ఓటు వేయడానికి వచ్చిన మహిళా ఓటర్లందరికీ గ్లాస్ మంచినీరు, ఒక రోజా పువ్వును ఎన్నికల అధికారులు అందించారు.

బండిఆత్మకూరు: మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగలేదు.

మహానంది: మహానంది మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ మూడు గ్రామాల్లో ఇరుపార్టీ కార్యకర్తల మధ్య స్వల్ప వాగ్వాదం తప్ప పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలోని 13 గ్రామ పంచాయితీ పరిధిలో 37 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేసారు. బుక్కాపురం, మసీదుపురం, అబ్బీపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ,టీడీపీ కార్యకర్తల మధ్య ఓటర్ల ప్రలోభాలాకు ఉపక్రమిస్తున్నారని ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకొని దూషించుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకొని వ్యవహారంను సద్దుమణిగించారు. మహానందిలోని 195 పోలింగ్ కేంద్రంలోని ఈవీఎం మొరాయించడంతో గంటన్నర తర్వాత 8.30 గంటలకు ఓటింగ్‌ను ప్రారంభించారు. అలాగే అబ్బీపురం, గాజులపల్లి ఆర్ఎస్‌లోని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో రాత్రి వరకు పోలింగ్‌ను కొనసాగించారు.

పాణ్యం: మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. చిన్న చిన్న ఘటనలు మినహా పోలింగ్ సజావుగా సాగింది. 279 కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. పాణ్యం మెయిన్ పాఠశాలలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య చిన్న పాటి ఘర్షణ తలెత్తడంతో పోలీసుల చొరవతో సద్దుమనిగింది. పాణ్యం మెయిన్ స్కూల్‌లో ఆరు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో ఓటర్లు సరైన స్థలం లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పిన్నాపురం, నెరవాడ గ్రామాలలో చిన్నపాటి ఘర్షణలు తలెత్తాయి. 279వ బూతులో ఓటర్లకు పోలింగ్ సిబ్బంది సిరాను వేయడం మరిచారు. కందికాయపల్లి, గోరుకల్లు గ్రామాలలో ఈవీఎంలు మొరాయించడంతో రాత్రి 11 గంటల వరకు ఓటర్లు పోలింగ్ లో పాల్గొన్నారు. గోనవరం గ్రామానికి చెందిన పశ్చిమబెంగాల్ రాష్ట్రం కలకత్తా జాయింట్ కలెక్టరు గడ్డం సుధీర్‌కుమార్‌రెడ్డి క్యూలో నిల్చొని ఓటు హక్కు వినియోగించుకున్నారు.

గడివేముల: మండలంలో 42 పోలింగ్ బూత్‌లు ఉండగా 267, 269 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. 264 పోలింగ్ కేంద్రంలో ఏజెంట్లకు కూర్చొవడానికి కుర్చీలు లేకపోవడంతో నేలపైన కూర్చున్నారు. గడివేములలో వైసీపీ నాయకులు పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల ప్రచారం చేస్తుండటంతో నంద్యాల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కొరటమద్ది గ్రామంలో జరుగుతున్న పోలింగ్ సరళిని పరిశీలించారు. గడివేములలో ఎన్నికల అబ్జర్వర్ పంకజ్ కుమార్, లెజరింగ్ అధికారులు అంజనేయులు, విజయ్‌కుమార్‌లు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మండలంలో సాయంత్రం ఈదురు గాలులు బలంగా వీచడంతో 30 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో గడివేముల, కె.బొల్లవరం, మంచాలకట్ట, గని, ఎల్‌కే తాండ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గడివేములలోని 306 పోలింగ్ బూత్‌లో విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో చీకటిగా ఉందని వైసీపీ ఏజెంట్ సెల్‌ఫోన్‌తో టార్చ్‌లైట్ వేయడంతో ఓటర్లు ఓటు వేసేందుకు భయాందోళనకు గురయ్యారని టీడీపీ ఏజెంట్లు అభ్యంతరం వ్యక్తం చేశారు.


ఆత్మకూరులో..


గోనవరంలో పోలింగ్ క్యూలో నిల్చున్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కలకత్తా జాయింట్ కలెక్టర్ సుధీర్‌కుమార్‌రెడ్డి


పెద్దదేవళాపురంలో ఓటు వేయడానికి వస్తున్న 90ఏళ్ళ పైబడిన వృద్ధురాలు


నాగటూరులో..


పాములపాడులో..


అమలాపురంలో..



సింగరాజుపల్లిలో..


పసురుపాడులో..


మంచాలకట్టలో..


తరిగోపుల గ్రామంలో..








ఓటు హక్కు వినియోగించుకున్న బుడ్డా రాజశేఖరరెడ్డి కుటుంబ సభ్యులు, ఐఎంఏ యాక్షన్ కమిటీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జి.రవికృష్ణటీడీపీ నంద్యాల అభ్యర్థి ఎన్ఎండీ ఫరూర్, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, వైసీపీ అభ్యర్థి దారా సుధీర్, శిల్పా కుటుంబ సభ్యులు

ఓటర్లను ప్రభావితం చేయడానికి వైసీపీ యత్నం..?

ఆత్మకూరు, మే 13: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆత్మకూరులోని పలు పోలింగ్ కేంద్రాల్లో వైసీపీ నాయకులు ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రత్యేకించి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పట్టణంలోని పలు పోలింగ్ బూత్‌లను సందర్శించి అక్కడే మకాం వేయడంతో వెంగళనగర్ పోలింగ్ స్టేషన్‌లో టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అలాగే మిగతా పోలింగ్ కేంద్రాలను కూడా ఆయన పలుమార్లు సందర్శించి ఓటర్లను ప్రభావితం చేసే యత్నం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా సంతమార్కెట్‌లోని పోలింగ్ సెంటర్‌లో ఎమ్మెల్యే శిల్పా తనయుడు కార్తీక్‌రెడ్డి పీఏ జుబేర్ అక్కడే మకాం వేసి ఓటర్లను ప్రభావితం చేసేందుకు యత్నించగా టీడీపీ అభ్యర్థి బుడ్డా అక్కడికి చేరుకుని పోలీసులచే ఆయన్ని అక్కడి నుంచి బయటకు పంపించారు. అదేవిధంగా తోటగేరిలోని పోలింగ్ కేంద్రం వద్దకు వైసీపీ నాయకులు అహ్మద్‌హుసేన్ రావడంతో స్థానిక టీడీపీ నాయకులు ఆయన్ని అడ్డుకోవడంతో పోలీసులు ఆయన్ని వెనక్కి పంపించారు. ఎమ్మెల్యే స్టిక్కర్‌తో కూడిన వాహనాలు పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లడంతో మాజీ ఎమ్మెల్యే బుడ్డా వారిపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇలా ఎక్కడికక్కడ ఓటర్లను ప్రభావితం చేసేందుకు వైసీపీ నాయకులు ప్రయత్నించారని టీడీపీ నాయకులు చెప్పారు.

మీ అంతు చూస్తా

● టీడీపీ నాయకులకు వైసీపీ నాయకుడి హెచ్చరిక

నందికొట్కూరు రూరల్ మే 13: మీ అంతు చూస్తానంటూ నాగటూరు గ్రామంలోని 7, 8 పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ నాయకులను కేసీ కెనాల్ ఉద్యోగిగా పనిచేస్తున్న వైసీపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి బెదిరించారు. సిద్దార్థరెడ్డి ముఖ్య అనుచరుడిగా సుధాకరెడ్డి ఉన్నారు. సోమవారం నందికొట్కూరు మండలంలోని నాగటూరు గ్రామంలో 7, 8 పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న ఇంట్లో వైసీపీ నాయకులు సుధాకరెడ్డి తిష్ట వేసి ఓటు వేయడానికి వస్తున్న ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. అంతేగాకుండా ఇతను కేసీ కెనాల్ సెక్షన్ కార్యాలయంలో సబ్ ఆర్డినేట్ ఉద్యోగి అయివుండి కూడా గత 15 రోజులుగా వైసీపీ నాయకులతోనేరుగా ప్రచారాలు నిర్వహించారని టీడీపీ నాయకులు, గ్రామస్థులు ఆరోపించారు. ఎన్నికల అధికారులు ఆయనకు సస్పెండ్ ఆర్డర్ కూడా జారీ చేశారని వారు తెలిపారు. అయినప్పటికీ పోలింగ్ రోజుకూడా వదలకుండా ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని టీడీపీ నాయకులు అక్కడే వున్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా పట్టించుకోకుండా టీడీపీ నాయకులపై గొడవకు దిగారు. మీఅంతు చూస్తామని బెదిరించారు. దీనితో టీడీపీ నాయకులు కార్యకర్తలు, వైసీపీ నాయకులు కొద్దిసేపు తోపులాడుకున్నారు. పోలీసులు వచ్చి గుంపును చెదరగొట్టారు. వైసీపీ నాయకులను అక్కడి నుంచి పంపించివేశారు. దీనితో గొడవ సద్దుమనిగింది.


నాగటూరులో గొడవ పడుతున్న నాయకులు


టీడీపీ నాయకులను హెచ్చరిస్తున్న వైసీపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి

అస్వస్థతతో వృద్ధుడి మృతి

పగిడ్యాల, మే 13: మండల పరిధిలోని బీరవోలు గ్రామానికి చెందిన బోయ నరసింహులు(70) సోమవారం అస్వస్థతకు గురై మృతి చెందారు. మధ్యాహ్నం ఓటు వేసేందుకు గ్రామం లోని పోలింగ్ కేంద్రానికి ఆటోలో ఎక్కి వచ్చారు. క్యూ లైన్‌లో నిలిచి ఓటు వేసిన అనంతరం తిరిగి ఇంటికి చేరుకున్నారు. కొద్దిసేపటికే అస్వస్థతకు గురై మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. ఓటు వేసేందుకు వచ్చి వృద్ధు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


చాగలమర్రిలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న భూమా అఖిలప్రియ


బనగానపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ


సంజామలలో బారులుదీరిన మహిళా ఓటర్లు


యర్రగుంట్లలో క్యూలైన్‌లో నిల్చున్న ఓటర్లు


రుద్రవరంలో ఓటు వేసేందుకు వృద్ధురాలిని తీసుకెళ్తున్న దృశ్యం


హరివరం, చాగలమర్రిలో తొలిసారి ఓటు వినియోగించుకున్న యువతులు


ఆళ్లగడ్డలో మాజీ మంత్రి అఖిలప్రియ ఇంటి వద్ద మోహరించిన పోలీసు బలగాలు


మీరాపురంలో ఓటు వేసినట్లు వేలిని చూపుతున్న 94 ఏళ్ల సోమశెట్టి వీరమ్మ, బనగానపల్లెలో వృద్ధురాలిని మోసుకు వస్తున్న కుటుంబసభ్యులు


కోవెలకుంట్ల పట్టణంలో ఓటేసేందుకు బారులు దీరిన జనం


డోన్‌లో ఓటు వేసేందుకు బారులుదీరిన జనం


ప్యాపిలిలో ఓటు వేపించేందుకు దివ్యాంగుడిని ఎత్తుకొని వస్తున్న యువకుడు


ఆళ్లగడ్డ పట్టణంలోని సెయింట్ అన్స్ పాఠశాలలో ఓటు వేసేందుకు బారులుదీరిన మహిళా ఓటర్లు

పోలింగ్ ప్రశాంతం

నంద్యాల, మే 13(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ఆళ్లగడ్డ నియోజకవర్గంలో చెదురు ముదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య తోపులాట: జి.జంబులదిన్నె, ఓబుళం పల్లె గ్రామాల్లో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య తోపులాట జరిగింది. జి.జంబులదిన్నె గ్రామంలో పోలింగ్ కేంద్రంలో ఎవరూ ఉండరాదన్న విషయంలో ఇరు వర్గాల మధ్య మాటామాటా పెరిగి తోపులాటకు దారిసింది. ఈ విషయాన్ని అక్కడున్న పోలీసు సిబ్బంది పోలీసు ఉన్నతాధికారులకు తెలపడంతో వారంతా హుటాహుటిని గ్రామాన్ని చేరుకొని ఇరువర్గాలను చెదరకొట్టారు. ఈ నేపేద్యంలో పోలింగ్ పది నిమిషాలు ఆగిపోయింది. ఆ తరువాత యథావిధిగా సాగింది.

అఖిలప్రియ ఇంటి వద్ద పోలీసుల మోహరింపు: ఆళ్లగడ్డ పట్టణంలోని టీడీపీ అభ్యర్థి అఖిలప్రియ ఇంటి వద్ద సోమవారం పోలీసులు మోహరించారు. పోలింగ్ కేంద్రాల వద్దకు అధికార పార్టీ నాయకులు భారీ ఎత్తున వాహనాల్లో వెళ్తే అడ్డగించకుండా తమ వాహనాలను అడ్డుకోవడం ఏమిటని టీడీపీ నాయుడు భార్గవ్‌రామ్‌నాయుడు ఆక్షేపించారు. సోమవారం పోలింగు కేంద్రాల వద్దకు ఎక్కువ వాహనాల్లో వెళ్తుండగా పోలీసులు అడ్డుకోవడంపై పట్టణంలోని ఆమె ఇంటి వద్ద పోలీసు అధికారులకు, భార్గవ్‌రామ్‌నాయుడుకు మధ్య వాగ్వాదం జరిగింది.

డోన్: మండలంలో ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్ డోన్ నియోజకవర్గంలో 82.27 పోలింగ్ శాతం నమోదైంది. మొత్తం 2,27,351 ఓట్లకు గాను లక్ష 87వేల 045 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో పురుష ఓటర్లు 93,143 మంది ఉండగా, మహిళా ఓటర్లు 93,865 మంది ఉన్నారు. ఇతరులు 37 మంది ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గంలోని 291 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి మహేశ్వరరెడ్డి పర్యవేక్షణలో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. ఉదయం 6 గంటల వరకు భారీ వర్షం కురిసినప్పటికీ ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్దకు తరలివచ్చి బారులు తీరారు. మహిళలు, వృద్ధులు, యువత, వికలాంగులు తరలివచ్చి ఓట్లు వేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి డోన్ పట్టణంలోని నారాయణ పాఠశాలలోని 91వ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

● **మొదట మొరాయించిన ఈవీఎంలు:** డోన్ అసెంబ్లీ నియోజకవర్గంలో మొదటి రెండు గంటలు ఈవీఎంలు మొరాయించాయి. దీంతో పలు పోలింగ్ కేంద్రాల్లో ఆలస్యంగా పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది.

● **ఆ పోలింగ్ కేంద్రాల వద్ద కిటకిట:** డోన్ పట్టణంలోని అభ్యుదయ మహిళా కళాశాలలో 5 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ధర్మవరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వర్షం కారణంగా పోలింగ్‌లో పాల్గొనడానికి ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. చిన్నమల్కాపురం ఉన్నత పాఠశాలలోనూ వర్షం నీటి నిల్వతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

● **మంత్రి బుగ్గనను వెంబడించిన కోట్ల సుజాతమ్మ:** డోన్ పట్టణంలో పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్తున్న వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల వద్ద మంత్రి బుగ్గన, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ మధ్య కొద్దిసేపు వాగ్వివాదం జరిగింది. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని అక్కడి నుంచి ఇరువురిని పంపించారు. అదే విధంగా పట్టణంలో టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు కోట్ల నివేదిత, మండలంలో కోట్ల రాఘవేంద్రరెడ్డి పోలింగ్ సరళిని పరిశీలించారు.

బనగానపల్లె: బనగానపల్లె నియోజకవర్గంలో మండలంలోని ఎర్రగుడి, కొలిమిగుండ్ల మండలంలోని పెట్నికోట గ్రామంలో టీడీపీ వైసీపీ వర్గీయుల మధ్య జరిగిన రెండు ఘటనలు మినహా మిగతా చోట్ల ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఓటర్లు ఉదయం 6 గంటల నుంచే నియోజకవర్గంలోని ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ముఖ్యంగా మహిళలు అధికంగా ఓటింగ్‌లో పాల్గొనడం విశేషం. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. బనగానపల్లె నియోజకవర్గంలో చాలా చోట్ల ఈవీ ఎంలు మొరాయించడంతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు. బనగానపల్లె నియోజకవర్గంలోని కొలిమిగుండ్ల మండలం పెట్నికోట, బనగానపల్లె మండలం ఎర్రగుడి గ్రామాల్లో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి, ఆయన సతీమణి బీసీ ఇందిరమ్మ, బీసీ రామ్‌నాథ్‌రెడ్డి నియోజకవర్గంలోని అన్ని మండలా ల్లో పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షిం చారు. అలాగే వైసీపీ తరపున కాటసాని రామిరెడ్డి పోలింగ్ కేంద్రాలను సం దర్శించారు. బనగానపల్లె పట్టణంలో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరిగింది. పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో పోలీసు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. బనగానపల్లె సీఐ గంటా సుబ్బారావు, బీఎస్‌ఎఫ్ సిబ్బంది, ప్రత్యేక పోలీసు సిబ్బంది ప్రతి పోలింగ్ కేంద్రంలో, పట్టణంలో పర్యటించి శాంతి భద్రతలను పర్యవేక్షించారు.

పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన ఎస్పీ

బనగానపల్లె రూరల్: బనగానపల్లె, కోవెలకుంట్ల పట్టణాల్లోని పోలింగ్ కేంద్రాలను నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, కోవెలకుంట్ల జూనియర్ కళాశాలలో పోలింగ్ సరళిని ఎస్పీ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె ఎన్నికల అబ్జర్వర్ దినేష్‌కుమార్ కోవెలకుంట్లలో పర్యటించి ఆయా పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు.

కొలిమిగుండ్ల రూరల్: మునుపెన్నడూ లేనివిధంగా పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు పోటెత్తారు. మండలంలోని వివిధ గ్రామాల్లో కొన్ని చెదురు ముదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతగా జరిగింది. వర్షం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో కొలిమిగుండ్ల మండలంలోని చాలా గ్రామాల్లో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమయ్యింది. దీనికి తోడు పెట్నికోట, చింతలాయపల్లె, గోర్విమానుపల్లె తదితర గ్రామాల్లో ఇవీఎంలు కాసేపు మోరాయించాయి. మండలంలోని 50పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 43,083మంది ఓటర్లు వుండగా 78శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. తహసీల్దార్ సునితాబాయి పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. తిమ్మనాయినిపేట గ్రామంలో ఐఆర్ఎస్ అధికారి వంశీవర్ధన్ ఓటు హక్కు వినియోగించుకోగా, కొలిమిగుండ్ల మండలం నాయినిపల్లెలో జడ్పీ చైర్మెన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

సంజామల: మండలంలో సమస్యాత్మ, అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో చెదురు ముదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. మండల వ్యాప్తంగా 39 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మండల వ్యాప్తంగా దాదాపు సాయంత్రం 6 గంటలకల్లా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోగా పేరుసోములలోని 145, 147 పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 9 గంటల వరకు ఓటర్లు బారుతీరారు.

అవుకు: మండలంలో సోమవారం ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7గంటలకే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. వృద్ధులు, చంటిబిడ్డలతో మహిళలు పోలింగ్ కేంద్రాలు చేరుకొని ఓటు వేశారు. రామవరం , కోనాపురం పోలింగ్ కేంద్రాలు మినహా అన్ని కేంద్రాలలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది, మండలంలోని చెన్నం పల్లె పోలింగ్ కే ంద్రంలో పాణ్యం మాజీ ఎమ్మెల్యె బిజ్జం పార్థసారథి రెడ్డి ఆయన సతీమణి ప్రణీత రెడ్డి ఓటు వేశారు. తమ గ్రామాల్లో ఆధిపత్యం చెలాయిస్తున్న కాటసాని. చల్లా కుటుంబీకులకు పట్టున్న గ్రామాల్లో తొలిసారిగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వర్షం పడడంతో కునుకుంట్ల, రామాపురం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్ళడానికి అవస్థలు పడ్డారు. వర్షపునీరు నిలువ ఉండడంతో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వెళ్లడానికి అవస్థలు పడ్డారు. అయినా ఓటర్లు బురదనీటిలో నడచి వచ్చి ఓటుహక్కును వినియో గించుకున్నారు.

బేతంచెర్ల: బేతంచెర్ల పట్టణంలో, ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో ఎన్నికల కేంద్రాలకు వృద్ధులు, దివ్యాంగులు మనుమళ్లు, కొడుకుల సాయంతో ట్రక్కర్‌లో తీసుకుని వచ్చి ఓటు వేయించుకుని వెళ్లారు. గోరుమానుకొండ గ్రామంలో ఈవీఎంలు మొరాయించడంతో 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉండగా.. రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. పట్టణంలో ప్రాథమిక పాఠశాలలో సాయంత్రం 4 గంటల తర్వాత కూడా గూటుపల్లె రహిమాన్‌పురం, ఆర్ఎస్ రంగాపురం పోలింగ్ కేంద్రాల వద్ద 6 గంటల వరకు బారులు దీరారు.

కోవెలకుంట్ల: మండలంలో సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 6నుంచే ఓటు వేసేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పట్టణంలోని సెంట్‌జోసెఫ్ పాఠశాల, ప్రభుత్వ జూ నియర్ కళాశాలలో పాటు బిజనవేముల గ్రామంలోని ఈవీఎంలు కొన్ని గం టలపాటు మొరాయించడంతో అధికారులు ఆర్‌వోతో మాట్లాడి వేరే ఈవీఎంలో తెప్పించి ఎన్నికల ప్రక్రియ గంట ఆలస్యంగా కొనసాగింది. దీంతో ఓటర్లు కాసేపు కూర్చున్నారు. సౌదరదిన్నె, కోవెలకుంట్ల, గ్రామాల్లో చిన్నపాటి వివాదాలు చోటు చేసుకున్నాయి.

ప్యాపిలి: మండలంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని 32వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో దాదాపు గంటసేపు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్యాపిలిలో, టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, జలదుర్గంలో, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ప్యాపిలిలో పోలింగ్ సరళిని పరిశీలించారు. పట్టణంలో టీడీపీ నాయకులు రాజా నారాయణ మూర్తిపై ఎస్ఐ దురుసుగా వ్యవహరించడంతో సుజాతమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. జలదుర్గంలోని 154, 155 పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయిస్తుండడంతో రాత్రి 7.30 గంటల వరకు పోలింగ్ కొనసాగింది.

శిరివెళ్ల: శిరివెళ్ల మండలంలోని 62 ఎన్నికల కేంద్రాల్లో సార్వత్రిక ఎన్నికలు సజావుగా ముగిసాయి. శిరివెళ్లలోని పలు పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి పరిశీలించారు. శిరివెళ్ల, యర్రగుంట్ల తదితర గ్రామాల్లో జరుగుతున్న పోలింగ్ సరళిని టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి భూమా అఖిలప్రియ, టీడీపీ నాయకులు జగత్ విఖ్యాత్‌రెడ్డి, భార్గవ్‌రామ్ నాయుడు పరిశీలించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి హైకోర్టు న్యాయవాది గోగిశెట్టి నరసింహారావు వీరారెడ్డిపల్లె గ్రామంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. గ్రామాల్లో ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా సీఐ చంద్రబాబు, ఎస్ఐ సురేష్ తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

గుర్తింపు కార్డుపై అవగాహన కరువు: మండలంలోని వీరారెడ్డిపల్లె, గుండంపాడు, శిరివెళ్ల తదితర గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఓటరు స్లిప్పుతో పాటు ఏదైనా ఒక గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉండాలన్న విషయంపై అధికారులు సరైన అవగాహన కల్పించకపోవడంతో ఓటర్లు కేంద్రాల నుంచి వెళ్లిపోయారు.

శిరివెళ్లలో స్వల్ప ఉద్రిక్తత : శిరివెళ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలోని ఎన్నికల కేంద్రాల వద్ద స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఓటు వేసే విషయంలో వివాదం తలెత్తడంతో ఇరు వర్గాలకు చెందిన పలువురు వ్యక్తులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. టీడీపీ నాయకుడు, 103వ బూత్ ఇన్‌చార్జి నాలి వలి ఎన్నికల కేంద్రంలో గుండెపోటుతో మృతి చెందారు. మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, టీడీపీ నాయకులు ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

చాగలమర్రి: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం మండలంలో ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ జరిగింది. మండలంలోని 52 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటల నుంచి ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. శెట్టివీడు గ్రామంలో 204, చాగలమర్రిలోని 229వ పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. గొడిగనూరు గ్రామంలో ఉదయం పోలింగ్ ప్రారంభం నుంచే పెద్ద ఎత్తున ఓటర్లు బారులు తీరడంతో పోలీసులు ఓటర్లను అదుపు చేయలేక పోయారు. పోలింగ్ కేంద్రంలోని ఓ పీవో అత్యుత్సాహం చూపించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు సరిగా లేక పోవడంతో మహిళా ఓటర్లు ఓటు వేసేందుకు పలు ఇబ్బందులు పడ్డారు. మహిళా కానిస్టేబుళ్లను కూడా నియమించక పోవడంతో పోలింగ్ సరళి సక్రమంగా నిర్వహించక పోవడం, మరో పక్క ఈవీఎంలు పని చేయకపోవడంతో ఓటర్లకు కష్టాలు తప్పలేదు. ఎస్ఐ రమణయ్య పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

● చాగలమర్రి బాలికోన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. అలాగే టీడీపీ నాయకులు భూమా జగత్ విఖ్యాతరెడ్డి ఆర్సీఎం పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. పోలింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

చిన్నబోదనంలో టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య ఘర్షణ: మండలంలోని చిన్నబోదనం గ్రామంలో పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య ఘర్షణ నెలకొంది. టీడీపీకి చెందిన శజ్జారెడ్డి, ఆమె చెల్లి ఓటు హక్కు వినియోగించుకునేందుకు క్యూలో నిలిచి ఉండగా వైసీపీ నాయకులు గొడవ పడ్డారు. శజ్జారెడ్డి, ఆమె తండ్రి రమణారెడ్డిపై వైసీపీ నాయకులు దౌర్జన్యానికి పాల్పడ్డారు. టీడీపీ నాయకుడు రమణారెడ్డి గాయపడ్డారు.ఎస్ఐ రమణయ్య గ్రామానికి చేరుకొని ఘర్షణను సద్దుమనిగించారు.

ఉయ్యాలవాడ: మండలంలో చెదురు ముదురు ఘటనలు మినహా ఓటింగ్ ప్రాశాంతంగా సాగింది. పలు గ్రామాల్లో ఈవీయంలు మొరాయించడంతో ఉదయం 7 గంటలకు ప్రారంభం కావలసిన ఓటింగ్ పక్రియ పడిగెపాడు గ్రామంలో 8 గంటలకు, నర్సిపల్లె గ్రామంలో 8.30 గంటలకు, హరివరంలోని ఓ పోలింగ్ కేంద్రంలో 9 గంటలకు ప్రారంభం అయ్యింది. గంటల తరబడి నిలబడలేక వృద్ధులు, చిన్నబిడ్డల తల్లులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూర్చోటానికి కుర్చీలు ఏర్పాటు చేయకపోవడంతో మెట్ల మీద, చెట్ల కింద కూర్చున్నారు. ఓటర్లను క్యూలైల్లలో పంపించేందుకు పోలీసులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. కొన్ని గ్రామాల్లో ఎండలో నిలబడి ఓటు చేసే పరిస్థితి నెలకొంది.

రుద్రవరం: రుద్రవరంలోని 263, 265, చిన్నకంబలూరులోని 248, పెద్దకంబలూరులోని 252 పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో సుమారు గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. శ్రీరంగాపురం, చిన్నకంబలూరులో రాత్రి 9 గంటల తర్వాత పోలింగ్ ముగిసింది. రుద్రవరం పోలింగ్ కేంద్రంలో వర్షానికి టెంట్లు కూలాయి. రుద్రవరం మండలంలో 51 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ పూర్తయినట్లు అసిస్టెంటు రిటర్నింగ్ ఆఫీసరు మురళీమోహన్, ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. గ్రామాల్లో రీపోలింగ్ మాత్రం లేదని చెప్పారు. ఎర్రగుడిదిన్నె పోలింగ్ కేంద్రాన్ని పోలీసు అబ్జర్వర్ త్రివేది పరిశీలించారు. యల్లావత్తుల గ్రామంలో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది చిన్నకంబలూరు గ్రామంలో ఇరుపార్టీల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. రుద్రవరంలో 263, 265 పోలింగ్ కేంద్రాల వద్ద తీవ్రస్థాయి ఘర్షణకు దారి తీసింది. ఆలమూరులో, నరసాపురంలో స్వల్ప ఘర్షణకు దారి తీసింది.

కదలని పోలీసు రూట్ వాహనం: రుద్రవరంలో పోలీసులకు రూట్ నెం.15కు ఒక వాహనాన్ని కేటాయించారు. ఈ వాహనం 263, 265 పోలింగ్ కేంద్రాల సమీపంలో నిలిపారు. వాహనం స్టార్ట్ కాకపోవడంతో అక్కడ ఉన్న యువకులు తోశారు. ఇలాంటి వాహనాలను ఎన్నికల వేళ ఏర్పాటు చేసుకుంటే ఎలా అని ప్రశ్నించారు. అత్యవసరమైతే ఎలా వెళతారని ప్రశ్నించారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

బనగానపల్లె: బనగానపల్లె నియోజకవర్గంలో టీడీపీ బనగాపల్లె అసెంబ్లీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి, ఆయన సతీమణి బీసీ ఇందిరమ్మ, వారి కుమారుడు బీసీ మనోహర్‌రెడ్డి సోమవారం తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. బనగానపల్లె పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలోని ఆదర్శపాఠశాల (కస్బా పాఠశాల)లోని పోలింగ్ కేంద్రంలో వారు ఓటు వేశారు. అక్కడే ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఓటుహక్కును వినియోగించుకున్నారు.

బేతంచెర్ల: బేతంచెర్ల పట్టణంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలోని పోలింగ్ బూత్‌లో సోమవారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఆయన తనయుడు బుగ్గన అర్జున్ రెడ్డి కుటుంబ సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే మండలంలోని ఎంబాయి, రుద్రవరం, మండ్లవానిపల్లె, ముద్దవరం, ఎం.పెండేకల్, కొలుములపల్లె, పట్టణంలోని హనుమాన్‌నగర్, సంజీవనగర్‌లలోని పోలింగ్ కేంద్రాలను మంత్రి బుగ్గన సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీపీ నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ సీహెచ్ చలంరెడ్డి, బుగ్గన చంద్రారెడ్డి, ఖాజా హుసేన్, ముర్తుజావలి తదితరులు ఉన్నారు.

డోన్(రూరల్): డోన్ మండలం చిన్న మల్కాపురం గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో డోన్ కాంగ్రెస్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గార్లపాటి మద్దిలేటి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. చిన్నమల్కాపురం గ్రామ నివాసైన గార్లపాటి మద్దిలేటి తన స్వగ్రామంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

వర్షపు నీటితో ఓటర్ల ఇబ్బందులు: డోన్ మండలంలో చిన్నమల్కాపురం గ్రామ ఉన్నత పాఠశాలలో వర్షపు నీరు నిలిచిపోవడంతో పోలింగ్ కేంద్రంలో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. తెల్లవారుజామున ఓ మోస్తరు వర్షం కురవడంతో చిన్నమల్కాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో వాన నీరు నిలిచింది.


ఓటు హక్కు వినియోగించుకున్న ధర్మవరం సుబ్బారెడ్డి, ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీ పోచా బ్రాహ్మనందరెడ్డి, బిజ్జం ప్రార్థసారధిరెడ్డి దంపతులు, గార్లపాటి మద్దిలేటి, బుగ్గన తనయుడు అర్జున్‌రెడ్డి

డోన్‌లో టీడీపీదే విజయం: కోట్ల సుజాతమ్మ


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కోట్ల సుజాతమ్మ

డోన్, మే 13: వైసీపీ ప్రభుత్వంపై ప్రజలు స్పష్టంగా వ్యతిరేకత చూపారని, డోన్ అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీదే విజయం అని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. సోమవారం పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా కోట్ల సుజాతమ్మ విలేకరులతో మాట్లాడుతూ.. టీడీపీ అధినేత చంద్రబాబు వైసీపీ అరాచక పాలనపై చేసిన పోరాటానికి ప్రజలు అండగా నిలిచారన్నారు.

డోన్‌లో వర్షం..

పిడుగుపాటుకు రెండు పశువులు మృతి

డోన్(రూరల్), మే 13: డోన్ మండలంలో సోమవారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. మండలంలోని ధర్మవరం గ్రామంలో ఉరుములు, మెరుపులతో పాటు పిడుగు పడటంతో రెండు పశువులు మృత్యువాత పడ్డాయి. అలాగే పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ ఎదురుగా ఉన్న కాలనీలో వర్షం వల్ల నీరు నిలిచిపోవడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. ఆయా వీధుల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీవాసి హనుమంతురెడ్డి, కాలనీవాసులు తెలిపారు. తెల్లవారుజామున కురిసిన వర్షంతో ఉదయం రోడ్లన్నీ చిత్తడిచిత్తడిగా మారాయి.



బేతంచెర్ల వడగండ్ల వాన

బేతంచెర్ల: బేతంచెర్ల పట్టణంలో సోమవారం సాయంత్రం వడగండ్ల వాన కురిసింది.


బేతంచెర్లలో కురిసిన వడగండ్ల వాన

పోలింగ్ కేంద్రాల వద్దకు ఓటర్లుకు నీడగా వేసిన టెంట్లు సైతం నేలమట్టమ య్యాయి. ఓటర్లు రూముల్లోకి పరుగులు తీశారు. కర్నూలు-బనగానపల్లె ప్రధాన రహదారి ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి.

ఎగువ అహోబిలంలో ధ్వజారోహణం

నంద్యాల, మే 13(ఆంధ్రజ్యోతి): ఎగువ అహోబిలంలో వైశాఖ నృసింహ జయంతి బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం వేదపండితులు ధ్వజారోహణం కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం స్వామి వారికి అభిషేకం, తదితర కార్యక్రమాలను నిర్వహించారు.


ధ్వజారోహణం చేస్తున్న వేదపండితులు